ఇంక.. మీ పతనానికే..

రేవంత్ తీరుపై ఎమ్మార్పీఎస్ మండిపాటు

మా డప్పు మోత

పార్లమెంట్‌తో పాటు కంటోన్మెంట్ ఉప ఎన్నికలో మాదిగలకు దక్కని స్థానం

కంటోన్మెంట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

కంటోన్మెంట్, ఏప్రిల్ 8: ఇంత కాలం కాంగ్రెస్ పార్టీ విజయానికి మోగిన మాదిగ డప్పు, ఇంక ఇప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ, రేవంత్ పతనానికే మోగుతుందని ఎమార్పీఎస్ మండిపడుతోంది. మాదిగలకు కాంగ్రెస్ పార్టీ తీరని అన్యాయం చేసిందని, పార్లమెంట్‌తో పాటు కంటోన్మెంట్ ఉప ఎన్నికలో మాదిగలకు స్థానం లేకుండా చేసిందని ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జి ఇటుక శ్రీకిషన్ మాదిగ మండిపడ్డారు. పికెట్ చౌరస్తాలో సోమవారం కంటోన్మెంట్ ఎమ్మార్పీఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇటుక శ్రీకిషన్ మాదిగ మాట్లాడుతూ, 17 పార్లమెంట్ స్థానాల్లో నాలుగు శాతం కూడా లేని రెడ్లలకు ఆరు సీట్లు, 50 శాతానికిపైగా ఉన్న బీసీలకు రెండు స్థానాలు కేటాయించి, 12 శాతానికి పైగా ఉన్న మాదిగలకు మాత్రం స్థానమే లేకుండా చేసిందని విమర్శించారు. అదే విధంగా 45 ఏండ్లుగా కంటోన్మెంట్‌లో మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఈ సారి వచ్చిన ఉప ఎన్నికలో సైతం మాదిగలకు టికెట్ కేటాయించలేదని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కాదని, రెడ్ల, మాలల సర్కారు అని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో మాదిగల జనాభా ఎక్కువగా ఉందని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో మాదిగలే ఎక్కువ ప్రాణ త్యాగాలు చేశారని గుర్తు చేశారు. మాదిగలకు రావాల్సిన వాటాను కక్ష పూరితంగా అడ్డుకుంటూ సీఎం రేవంత్‌రెడ్డి వివక్షత చూపుతున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి మాదిగలను అంటరాని వారిగా భావిస్తున్నారని దుయ్యబట్టారు. మాదిగల సహకారంతో నేడు ఈ స్థాయికి ఎదిగిన రేవంత్ రెడ్డి, మాదిగల పట్ల వివక్షత చూపుతూ ఉంటే మాదిగ జాతి చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. కాంగ్రెస్ విజయానికి డప్పు కొట్టిన తమ మాదిగ జాతి, మీ పతనానికి డప్పు కొడుతుందని, ఈ అవమానాలు తమకేమీ కొత్తకాదని, కానీ కాంగ్రెస్‌ను అధికారం నుంచి దింపే వరకు తమ ఆత్మ గౌరవ ఉద్యమ పోరాటం ఆగదన్నారు. రేవంత్ రెడ్డి విలువల్లేని, విధానాలు లేని రాజకీయాలు చేస్తున్నారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇలాంటి రాజకీయాలు ఎల్లకాలం చెల్లవని, లోక్‌సభతో పాటు కంటోన్మెంట్‌లో జరుగుతున్న ఉప ఎన్నికలో గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అజిత్ కళ్యాణ్, రొట్టెల సునీల్ మాదిగ, కొంపల్లి శ్రీకాంత్ మాదిగతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పికెట్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేస్తున్న కంటోన్మెంట్ ఎమ్మార్పీఎస్ నాయకులు

లోలోపలికి భూగర్భ జలాలు..
ట్యాంకర్లకు పెరిగిన డిమాండ్

- అదనంగా 300 ట్యాంకర్లను సమకూర్చి.. 12 గంటల్లోగా అందిస్తాం
- ఇండ్లలో ఇంకుడు గుంత నిర్మాణం తప్పనిసరి చేస్తాం
- 15 నుంచి కృష్ణా, మే 1 నుంచి అత్యవసర పంపింగ్
- గ్రేటర్ తాగునీటి సమీక్షా సమావేశంలో దానకిశోర్

సిటీబ్యూరో, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో భూగర్భజలాలు తగ్గడంతోనే ట్యాంకర్ వాటర్‌కు డిమాండ్ ఏర్పడిందని, గతేడాది కంటే ఈ సారి మొదటి మూడు నెలల్లోనే 10వేల మంది వినియోగదారులు ట్యాంకర్ నీటిపై ఆధారపడుతున్నట్లు సర్వేలో తేలిందని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ తెలిపారు. గత సంవత్సరంలో సగటు ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా 12గా ఉంటే ఈ ఏడాది 20కి పెరిగిందన్నారు. కొండాపూర్, మాదాపూర్, శేరిలింగంపల్లి, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఖైరతాబాద్, షేక్‌పేట, మణికొండ ఏరియాల్లో మల్టీస్టోరేజ్ బిల్డింగ్‌లతో భూగర్భ జలాలు అడుగంటిపోయి 31వేలకు పైగా వినియోగదారులు వాటర్ ట్యాంకర్లపై ఆధారపడ్డారని, దాదాపు 1700 ప్రాంతాల్లో జల మండలి సర్వే నిర్వహించిందని దానకిశోర్ తెలిపారు. నగరంలో చాలా ప్రాంతాల్లో 50 నుంచి 60 మీటర్ల లోతుల్లో భూగర్భజలాలు ఒట్టిపోయాయని, ఈ ప్రాంతాలలో తరచూ వాటర్ ట్యాంకర్ కోరుకునే వినియోగదారులకు ఇంటికి జలమండలి, ఎన్జీవో సంస్థలు వెళ్లి వీరంతా ఇంకుడు గుంతల నిర్మాణం తప్పనిసరిగా ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఇంకుడు గుంతలు లేని వారికి రూఫ్ టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. గ్రేటర్‌లో తాగునీటి సరఫరా పరిస్థితిపై పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఈ సమావేశానికి జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి, రవాణాశాఖ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్, జాయింట్ కమిషనర్ రమేశ్, జలమండలి డైరెక్టర్లు డాక్టర్ ఎం.సత్య నారాయణ, అజ్మీరా కృష్ణ, వీఎల్ ప్రవీణ్‌కుమార్, స్వామి పాల్గొన్నారు. 705 ట్యాంకర్ల ద్వారా 24 గంటల పాటు ట్యాంకర్ నీటిని అందిస్తున్నామని., రాబోయే రోజుల్లో అదనంగా 300 ట్యాంకర్లను సమకూర్చుతామని దానకిశోర్ తెలిపారు. ట్యాంకర్ బుక్ చేసిన 12 గంటల్లోపే డెలివరీ చేసేందుకు ప్రయత్నం చేస్తామని చెప్పారు.

నీటి నిల్వలు వేగంగా తగ్గుముఖం

నాగార్జున సాగర్ నీటి నిల్వలు వేగంగా తగ్గుముఖం పడుతున్నాయని, 2017 సంవత్సర అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని రూ.4కోట్లతో ఎమర్జెన్సీ పంపింగ్ ఏర్పాట్లు చేశామని దానకిశోర్ తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి మొదటగా ఒక పంపుతో ఎమర్జెన్సీ పంపింగ్ ప్రారంభిస్తామన్నారు. సాగర్ డెడ్‌స్టోరేజీలో ఉన్నప్పటికీ కొత్తగా ఈ సారి బార్జ్ టెక్నాలజీని ఉపయోగించి వర్షాభావ పరిస్థితులున్నా కృష్ణా జలాలను ఏడాది పొడవునా ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎల్లంపల్లిలో ఉన్న నిల్వలు మూడు నెలల వరకు ఢోకా లేదని, మే 1నుంచి అత్యవసర పంపింగ్ ద్వారా నగరానికి నీళ్లు ఇస్తామన్నారు. సింగూరు, మంజీరా, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లో పుష్కలంగా నీరు ఉన్నదని, ఈ రిజర్వాయర్ల నుంచి అదనంగా 15 ఎంజీల మేర నీరు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. బెంగళూరులో 40శాతం మేర నీటి డిమాండ్ పెరిగితే నగరంలో4.2 శాతం మాత్రమే ఉందన్నారు. ఈ వేసవి ముగిసే వరకు జలమండలి యంత్రాంగం, డైరెక్టర్లు అప్రమత్తంగా ఉండి నీటి కొరతను అధిగమించే చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఒక్క సీటు ఇయ్యని కాంగ్రెస్‌కు ఓట్లేయం

మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 8: 'రాష్ట్ర జనాభాలో 70 లక్షలు ఉన్నాం.. కనీసం ఒక్క టికెట్ కూడా ఇయ్యలేదు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎందుకు ఓటెయ్యాలి' అని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. మాదిగ జేఏసీ, మాదిగ శక్తి, మాదిగ రాజకీయ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో మాదిగ జేఏసీ, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అధ్యక్షతన సోమవారం సాయంత్రం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మోత్కుపల్లి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో మాదిగలకు కాంగ్రెస్ చేసిన అన్యాయాన్ని ఎండగట్టారు. సీఎం రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడి స్థానంలో అసెంబ్లీలో మాదిగలకు అన్యాయం చేశారని, పార్లమెంట్ ఎన్నికల్లోనూ పూర్తిగా విస్మరించారన్నారు. మాదిగలంటే కాంగ్రెస్‌కు లెక్కలేదని మండిపడ్డారు. తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ వైర్మన్ గజ్జెల కాంతం మాట్లాడుతూ కాంగ్రెస్ మాదిగలకు ఏదో చేస్తుందని ఓట్లు వేశారని, కానీ అది పొరపాటుగా భావిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి తమ జాతికి చెందిన వ్యక్తి కాదన్నారు. కాంగ్రెస్ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 13న ఛలో గాంధీ భవన్ చేపడుతున్నామని, మాదిగలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో మాట్లాడుతున్న మోత్కుపల్లి

కాంగ్రెస్ పార్టీకి సమాధి కడుతం

రేవంత్ రెడ్డి, మల్లికార్జున్ ఖర్గే మాదిగ జాతి ద్రోహులు

ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముషీరాబాద్ ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ మాదిగ

కవాడిగూడ, ఏప్రిల్ 8: మాదిగలకు ద్రోహం చేసిన కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో రాజకీయ సమాధి కడుతామని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ మాదిగ అన్నారు. సోమవారం కవాడిగూడ అంబేద్కర్‌నగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, మల్లికార్జున్ ఖర్గేలకు వ్యతిరేకంగా ప్ల-కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గజ్జల రాజశేఖర్ మాదిగ మాట్లాడుతూ మాదిగ జాతికి కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో తీవ్ర అన్యాయం చేసిందని, రేవంత్ రెడ్డి, మల్లికార్జున్ ఖర్గే మాదిగ జాతి ద్రోహులని అన్నారు. మూడు ఎస్సీ రిజర్వుడు పార్లమెంట్ స్థానాలు ఉన్న తెలంగాణలో ఒక్కటి కూడా మాదిగలకు ఇవ్వలేదని మండిపడ్డారు. మాదిగలు ద్రోహం చేసిన కాంగ్రెస్‌కు తెలంగాణలో బొంద పెడుతామని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు 10 రోజుల పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో గురుకు నాగేశ్ మాదిగ, జేరిపోతుల సత్య నారాయణ మాదిగ, నరసింహ మాదిగ, మిట్ట గడపల రవీందర్ మాదిగ, అమ్ముగూడెం దశరథ్ మాదిగ, మహంకాళి వెంకటయ్య మాదిగ, దీపక్ మాదిగ, రోషిన్ వినయ్ మాదిగ, సాయిలు, జయ ప్రకాశ్ మదిగ పాల్గొన్నారు.

కవాడిగూడ అంబేద్కర్‌నగర్‌లో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఉపాధి హామీ కూలీలకు పెరిగిన దినసరి వేతనం

మేడ్చల్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ) : ఉపాధి హామీ కూలీలకు దినసరి వేతనాలు పెరిగాయి. ప్రస్తుతం రూ.272 చెల్లిస్తుండగా మరో రూ.28 పెంచడంతో రూ.300లకు చేరుకున్నది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 19,350 కూలీలకు లబ్ధిచేకూరనున్నది.

టీఎస్ఎస్పీడీసీఎల్ మొబైల్ యాప్ ఆధునీకరణ

సిటీబ్యూరో, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ) : విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలను అందించేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్) మొబైల్ యాప్‌ను ఆధునీకరించింది. గ్రేటర్ హైదరాబాద్‌లో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతుండడంతో అదే సేవలను ఆన్‌లైన్ ద్వారా అందించేందుకు చర్యలు చేపట్టింది.

తాగునీరు ఇయ్యండి సారూ..

జలమండలి అధికారులను వేడుకున్న బోయిగూడ వాసులు

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 8 : మూడు రోజులుగా బోయిగూడ సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాలలో స్థానికులు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. శనివారం ఉదయం నుంచి నీటి సరఫరా నిలిపివేశారు. అధికారులను సంప్రదించగా సాంకేతిక కారణాల వల్ల నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు. దీంతో శనివారం, ఆదివారం, సోమవారం బోయిగూడ పరిసరాల్లోని బస్తీలు, కాలనీలలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడ్డారు. బోయిగూడలోని జలమండలి ఆఫీసుకు వెళ్లిన ప్రజలు అక్కడి సిబ్బందితో వాగ్వాదానికి దిగారు.

భోలక్‌పూర్‌లో తాగునీటి కోసం మహిళల పాట్లు

పేద విద్యార్థుల అభ్యున్నతికి ఆయిస్టర్ కృషి అభినందనీయం

పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్

యూత్ ఓరియంటేషన్ కోర్సుతో పాలమూరు యూనివర్సిటీతో ఒప్పంద పత్రాలను అందుకుంటున్న ఆయిస్టర్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ సింగాడే తదితరులు

సుల్తాన్ బజార్, ఏప్రిల్ 8: పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం ఆయిస్టర్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు. ఈ మేరకు ఆయిస్టర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాలమూరు యూనివర్సిటీలో ఏడాదిగా కొనసాగుతున్న యూత్ ఓరియంటేషన్ కోర్సు ఒప్పందం ముగుస్తున్న సందర్భంగా సోమవారం మరో మూడేళ్ల పాటు ఎంవోయూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయిస్టర్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ సింగాడే, యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ రవికుమార్, రామ్మోహన్, ఆయిస్టర్ సంస్థ సభ్యులు ఆకాశ్, హెల్త్ డైరెక్టర్ హర్షిణి, టీఎంవీ వర్కింగ్ ప్రెసిడెంట్ రిషిక, సభ్యులు సోహిని పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్, బఫర్‌లలో నిర్మాణాలొద్దు

మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్.. శిథిల భవనాలను గుర్తించండి

టౌన్ ప్లానింగ్ విభాగం సమీక్షలో కమిషనర్ రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, ఏప్రిల్ 8(నమస్తే తెలంగాణ): ప్రజలకు నమ్మకం కలిగేలా టౌన్ ప్లానింగ్ శాఖ అధికారుల పనితీరు ఉండాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం 7వ అంతస్తు మీటింగ్ హాల్‌లో టౌన్ ప్లానింగ్ శాఖ అధికారులతో ఆయా అంశాలపై కమిషనర్ రొనాల్డ్ రాస్ సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. బిల్డింగ్ పర్మిషన్లకు సంబంధించి టీఎస్ బీ పాస్‌లో ఏ దరఖాస్తును అయినా 21 రోజుల్లోగా పరిష్కరించాలని రొనాల్డ్ రాస్ తెలిపారు. నిర్ణీత కాల వ్యవధిలో టౌన్‌ప్లానింగ్ అధికారులు నిబంధనల మేరకు అర్హత గల దరఖాస్తులను క్లియర్ చేయడం, లేదా వాటిని రిజెక్ట్ చేయాల్సి ఉంటుందన్నారు. గ్రీవెన్స్‌లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వచ్చిన అన్ని దరఖాస్తులను పరిష్కరించడంపై దృష్టి సారించాలని చెప్పారు. గ్రీవెన్స్ లాగిన్‌లో ఉన్న పెండెన్సీ దరఖాస్తులన్నీ వారంలోగా క్లియర్ చేయాలని ఆదేశించారు. కోర్టు కేసుల విషయంలో అశ్రద్ధ వహించొద్దని, టై బాండ్ కేసులలో వెంటనే చర్యలు చేపట్టాలని, జోన్, సర్కిల్ వారీగా పెండింగ్ కేసులకు సంబంధించి కౌంటర్ వేయాలని సూచించారు. మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా శిథిలావస్థలో ఉన్న గృహాలను గుర్తించి ఎలాంటి నష్టం జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. జంక్షన్ ఇంప్రూవ్‌మెంట్ ప్లాన్స్ సిద్ధం చేయాలని, మైనర్, మేజర్ జంక్షన్‌కు సంబంధించి తమ తమ సర్కిల్‌లో ఇబ్బందులను గుర్తించి ఎలాంటి ఆస్తులకు నష్టం జరగకుండా జంక్షన్ అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో గల నీటి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఎలాంటి ఆక్రమణలు, నిర్మాణాలు జరగరాదని తెలిపారు. లేక్స్ ప్రొటెక్షన్ వాట్సాప్ గ్రూప్‌లలో టౌన్‌ప్లానింగ్ వారిని చేర్చాలని సంబంధిత అధికారులకు సూచించారు. న్యాక్ ఇంజినీర్లు అనుమతులు లేని నిర్మాణాలను గుర్తించాలని, సుమోటోగా, ఫిర్యాదులకు సంబంధించిన వాటిపై వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ రాజేంద్రప్రసాద్ నాయక్, అడిషనల్ సీసీపీలు గంగాధర్, సీపీలు, ఏసీపీలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక కమిటీలకు తెలియకుండా ఇతర పార్టీల నేతలను చేర్చుకోవొద్దు

చౌదరిగూడ పంచాయతీ కాంగ్రెస్ శాఖ తీర్మానం

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు అప్పట్లో చేసిన సీఎం వ్యతిరేక కార్యక్రమాలను సభాముఖంగా చూపుతున్న కాంగ్రెస్ నాయకులు

ఘట్‌కేసర్, ఏప్రిల్ 8 : స్థానిక కాంగ్రెస్ కమిటీలకు తెలియకుండా ఇతర పార్టీల నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకోకూడదని ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ పంచాయతీ కాంగ్రెస్ తీర్మానం చేసింది. గ్రామ శాఖ అధ్యక్షుడు కట్ట ఆంజనేయులు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మొన్నటి వరకు ఇతర పార్టీలలో ఉండి పలు రకాలుగా అవినీతికి పాల్పడిన నాయకులను కాంగ్రెస్‌లో కలుపుకుంటున్నారని చౌదరిగూడ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్, నాయకులు నగేష్ గౌడ్, బోజిరెడ్డి, దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నర్సింహ గౌడ్ పేర్కొన్నారు. చౌదరిగూడ పంచాయతీ మాజీ సర్పంచ్ బైరు రమాదేవి రాములు గౌడ్ మొన్నటి వరకు వేరే పార్టీలో ఉండి సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా శవయాత్ర నిర్వహించాడని, పంచాయతీ కాంగ్రెస్ నాయకులపై తప్పుడు కేసులు బనాయించాడని, ప్రస్తుతం ఆయనను కాంగ్రెస్‌లో చేర్చుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. చౌదరిగూడలో ఉన్న 60కాలనీలకు చెందిన పార్కు స్థలాలను రాములు గౌడ్ అమ్ముకున్నాడని, అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులపై పోలీసులకు డబ్బులు ఇచ్చి కేసులు పెట్టించాడని ఆరోపించారు. ఇలాంటి వ్యక్తులను కాంగ్రెస్ నాయకులు సుధీర్‌రెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి వజ్రేశ్ యాదవ్ ఎలా ప్రోత్సహిస్తారని ప్రశ్నించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన చేరికల కమిటీ ఒక ఫెయిల్యూర్ కమిటీ అని కాంగ్రెస్ నాయకులు అన్నారు. చౌదరిగూడ పంచాయతీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకుల చేరిక విషయాన్ని పునరాలోచించాలని చౌదరిగూడ కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

ఐఐఎంసీలో ఇంటర్ కాలేజీ కామర్స్ టాలెంట్ టెస్ట్

మీడియా పార్టనర్‌గా 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే'

సిటీబ్యూరో, ఏప్రిల్ 8(నమస్తే తెలంగాణ) : ఐఐఎంసీ కళాశాల కామర్స్ విభాగం, అశోక స్కూల్ ఆఫ్ బిజినెస్, అంబిషనర్ కెరీర్ కౌన్సిలర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కామర్స్ టాలెంట్ టెస్ట్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన వచ్చింది. సోమవారం నిర్వహించిన ప్రతిభా పరీక్షకు తెలంగాణ వ్యాప్తగా ఉన్న పలు కాలేజీలకు చెందిన 451మంది విద్యార్థులు పాల్గొన్నారు. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులలో దాగి ఉన్న కామర్స్‌పై విషయ పరిజ్ఞానం, నైపుణ్యాలను అంచనా వేయడం కోసం ఇంటర్ కాలేజీ కామర్స్ టాలెంట్ టెస్టును నిర్వహించారు. కామర్స్ విభాగానికి సంబంధించి 125 ప్రశ్నలతో 90నిమిషాల పాటు నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతిని అందజేశారు. విద్యార్థుల్లో కామర్స్ రంగంపై ఆసక్తిని పెంచడమే లక్ష్యంగా గత కొన్నేళ్లుగా టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. మొదటి బహుమతిని నిజాం కాలేజీకి చెందిన కళ్యాణ్ రాజ్, రెండో స్థానంలో ఓయూకు చెందిన లహరి, ఐఐఎంసీకి చెందిన సంజన, మూడో స్థానంలో నిజాం కాలేజీకి చెందిన శశీర్ కుమార్, ఐఐఎంసీ కౌశిక్‌తోపాటు, 11మంది విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. కాగా టాలెంట్ టెస్ట్‌కు 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' మీడియా పార్టనర్‌గా వ్యవహరించింది. అనంతరం విద్యార్థులకు బహుమతులను పంపిణీ అందజేశారు.

18 నుంచి నామినేషన్ల స్వీకరణ



సిటీబ్యూరో, ఏప్రిల్ 8(నమస్తే తెలంగాణ) : ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ శశాంక కోరారు. సోమవారం రాజేంద్రనగర్ ఆర్వో కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, నోడల్ అధికారులతో కలెక్టర్ శశాంక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం స్థానం నుంచి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో పాటించాల్సిన నియమ నిబంధనలు, అవలంభించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు రాజేంద్రనగర్ ఆర్ఓ కార్యాలయంలో నామినేషన్లను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 26న పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణకు 29 వరకు గడువు ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ సంగీత, రాజేంద్రనగర్ ఏఆర్ఓ వెంకట్ రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు, జిల్లా యంత్రాంగం తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేయడం బాధ్యతగా భావించాలి

సిటీబ్యూరో, ఏప్రిల్ 8(నమస్తే తెలంగాణ): ఓటు వేయడం బాధ్యతగా భావించాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం మక్కా మజీద్‌లో ఓటరు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు వంద శాతం ఓటు హక్కు వినియోగించుకొని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలని రొనాల్డ్ రాస్ సూచించారు. వంద శాతం ఓటింగ్ అయ్యేలా ఓటర్లను చైతన్యపర్చడమే స్వీప్ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా జిల్లాలో వివిధ కార్యక్రమాల ద్వారా ఓటర్లకు అవగాహన కల్పిస్తూ చైతన్య పరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో జాయింట్ సీఈఓ సర్వరాజ్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అడిషనల్ కమిషనర్ అలివేలు మంగ తాయారు, అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి, స్వీప్ నోడల్ అధికారులు అరుణ కుమారి, యుగేంధర్ రెడ్డి, జోనల్ కమిషనర్ వెంకన్న పాల్గొన్నారు.

25 నుంచి హైలైఫ్ ఫ్యాషన్

బంజారాహిల్స్, ఏప్రిల్ 8 : వేసవి కాలంలో ప్రత్యేకమైన డిజైనర్ వస్త్రాలు, ఆభరణాలతో పాటు ఫ్యాషన్ యాక్సెసరీస్‌ను నగర వాసులకు అందించేందుకు ఏప్రిల్ 25నుంచి 27వరకు మాదాపూర్‌లోని నోవాటెల్ హోటల్‌లో హైలైఫ్ సమ్మర్ అండ్ స్ప్రింగ్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నారు. ఈ ఎగ్జిబిషన్‌కు సంబంధించిన కర్టెన్ రైజర్ కార్యక్రమం సోమవారం బంజారాహిల్స్ రోడ్ నం.10లోని మార్క్స్ మీడియా సెంటర్‌లో నిర్వహించారు. టాలీవుడ్ హీరోయిన్లు స్రవంతి చొక్కారపు, నిషత్ షేక్, మిస్ ఇండియా తెలంగాణ ఉర్మిళా చౌహాన్ తదితరులు పాల్గొని బ్రోచర్లను ఆవిష్కరించారు.

మురహరిపల్లిలో దారుణ హత్య

మేడ్చల్, ఏప్రిల్ 8 : బండరాయితో మోది ఓ వ్యక్తిని హత్య చేసిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం.. బీహార్‌లోని కుసుమౌట్ గ్రామానికి చెందిన మనీశ్ పాశ్వాన్(28), మెకినింద్రా పాశ్వాన్(39) బతుకు దెరువు నిమిత్తం మురహరిపల్లికి వచ్చి, గోపాల్ అనే వ్యక్తి వద్ద కూలీగా పనిచేస్తున్నారు. అయితే, ఇద్దరి మధ్య డబ్బులు విషయంలో తగాదా చోటు చేసుకుంది. ఈ విషయ